క్లుప్తంగా

పట్టణ అభివృద్ధికి సహకరించాలి



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

వేములవాడ: పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సహకరించాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలోని 14 కులసంఘాల భవన నిర్మాణాలకు శుక్రవారం ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారి కుల సంఘాల్లోకి రాగా ప్రభుత్వ విప్‌ను ఆయా కులసంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన మాటప్రకారం పలు కులసంఘం భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక



వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర కార్పెంటర్స్ సేవ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బారోజి అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా అంజనేయులు, గౌరవాధ్యక్షులుగా శంకరయ్య, కరుణాకర్, వెంకటస్వామి, దేవయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం రుద్రవరం ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వల్లే పార్టీకి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

మెగా డీఎస్సీతో విద్యాభివృద్ధి

ముస్తాబాద్: మెగా డీఎస్సీతో రాష్ట్రంలో విద్యాభివృద్ధి మెరుగుపడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ముస్తాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక గత పాలకులు విద్యారంగాన్ని పట్టించుకోలేదన్నారు. ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను నిర్వీర్యం చేశాడని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, మాజీ సర్పంచ్ వొరగంటి తిరుపతి, అగుళ్ల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ మంజుల

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేటలో తాగునీటి కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా బోరు మోటారు ఏర్పాటుకు శుక్రవారం జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాం లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి గడ్డం మధుకర్, బీఆర్‌ఎస్ నాయకుడు నీరటి బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



సన్మానిస్తున్న మాజీ సర్పంచులు

ముస్తాబాద్: మండల తహసీల్దార్ సురేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించినట్లు సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, ఇతర సమస్యలపై తహసీల్దార్‌తో చర్చించామన్నారు. మాజీ సర్పంచులు రవీందర్‌రెడ్డి, కృష్ణ, కాంపెల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

'కేకేను విమర్శిస్తే సహించం'

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నియోజకవర్గంలో కేకే మహేందర్‌రెడ్డి దయతోనే ఇక్కడ మాజీ మంత్రి కేటీఆర్‌కు రాజకీయ భవిష్యత్తు దక్కిందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేకే పుణ్యంతోనే సిరిసిల్లలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ నాయకులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి మహేందర్‌రెడ్డిని విమర్శిస్తున్నారన్నారు. ఇకపై కేకేను విమర్శిస్తే సహించేది లేదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆ పార్టీ నాయకులు మేడిగడ్డకు వెళ్లారన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలుచేస్తుందన్నారు.

అటు చదువు.. ఇటు బోధన

- 'పిల్లల కోసం'.. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు
- 'తొలిమెట్టు'లో డిగ్రీ విద్యార్థుల భాగస్వామ్యం
- ప్రతి శనివారం ప్రాథమిక పాఠశాలలకు వెళ్తూ విద్యార్థులకు విద్యాబోధన



విద్యాబోధన చేస్తున్న డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్

గంభీరావుపేట(సిరిసిల్ల): ఓ వైపు కళాశాలలో చదువుతూనే... వారానికో రోజు పాఠశాలలకు వెళ్లి చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ (జాతీయ సేవా పథకం) వలంటీర్లు ప్రతి శనివారం తమకు కేటాయించిన ప్రాథమిక పాఠశాలకు వెళ్లి వి ద్యార్థులకు ఆటపాటలతో విద్యాబోధన అందిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో 'తొలిమెట్టు'

కరోనా సమయంలో ప్రభుత్వ పాఠశాలలు సక్రమంగా నడవకపోవడంతో ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు తగ్గినట్లు విద్యాశాఖ గుర్తించింది. ఐదో తరగతిలోపు చదువుతున్న విద్యార్థులు చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు, భాగహారాలు వంటి ప్రాథమిక అంశాల్లో వెనుకబడిపోయినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక వి ద్యను బలోపేతం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రాథమిక పాఠశాలల్లో 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను భాగస్వాములను చేసేవిధంగా కళాశాల విద్యాశాఖ 'పిల్లల కోసం' అనే సరికొత్త కార్యక్రమం చేపట్టింది.

52 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే సుమారు 52 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తాము బడి పిల్లలకు విద్యాబోధన అందిస్తామని పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారికి సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కేటాయించారు. కళాశాల పరిధిలోని లింగన్నపేట, మల్లారెడ్డిపేట, ముస్తఫానగర్, వీర్నపల్లి తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో వలంటీర్లు చిన్నారులకు చదవడం, రాయడం, లెక్కలు, ఆంగ్లం, తెలుగు తదితర అంశాల్లో బోధన చేస్తున్నారు. పాఠశాలల్లో కనీస సామర్థ్యాలు లేని చిన్నారులకు ఆటపాటలతో బోధన చేస్తూ కనీసస్థాయికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. వారితో మమేకమై బోధన అందిస్తున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు 'మనందరం ఎవరి కోసం..? మనమంతా పిల్లల కోసం' అనే నినాదంతో స్నేహపూర్వక బోధనతో ముందుకెళ్తున్నారు. వీరికి త్వరలో విద్యాశాఖ సర్టిఫికెట్లును ప్రదానం చేయనున్నారు.

శ్రద్ధగా వింటున్నారు



మేము చదువుకుంటూనే వేరే బడికి వెళ్లి చిన్నారులకు పాఠాలు చెప్పడం ఆనందంగా ఉంది. భ విష్యత్‌లో మాకు ఈ కార్యక్రమం ప్రయోజనకరంగా ఉంటుందనుకుంటున్నాం. ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు. చిన్నారులు మమ్మల్ని టీచర్‌గా కాకుండా అక్కగా భావించి శ్రద్ధగా పాఠాలు వింటున్నారు. – కీర్తన, బీకాం ఫస్టియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంభీరావుపేట

సంతోషంగా ఉంది



బడి పిల్లలకు చదువు చెబుతుంటే మాకు అనుభవం కలుగుతుంది. చదువుకుంటూ నే విద్యార్థులకు బోధన అందించడం చాలా సంతోషంగా ఉంది. టీచర్లు అంటే విద్యార్థులు కాస్త భయపడుతుంటారు. కానీ మమ్మల్ని అ లా కాకుండా కుటుంబ సభ్యులుగా భావిస్తూ చెప్పిన విషయాలను పిల్లలు అర్థం చేసుకుంటున్నారు. – మధులిత, బీకాం ఫస్టియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంభీరావుపేట

భవిష్యత్‌లో దోహదం



కళాశాలలోని 52 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటర్లు స్వచ్ఛందంగా స్నేహపూర్వక విద్యాబోధనలో భాగస్వాములవుతున్నారు. ప్రతి శనివారం వారికి కేటాయించిన ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాల పెంపుకు కృషి చేస్తున్నారు. వలంటీర్ల సేవాభావం అభినందనీయం. వారికి ఈ కార్యక్రమం భవిష్యత్‌లో దోహదపడనుంది. – ధర్మపురి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కేటీఆర్‌ది సవతి తల్లి ప్రేమ

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కేటీఆర్‌కు సిరిసిల్లపై సవతిప్రేమ ఉందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కే.కే. మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం మెదక్ జిల్లాను సస్యశ్యామలం చేశారని, సిరిసిల్లను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. మల్కపేట రిజర్వాయర్ ట్రయల్ చేసి ఎకరానికైనా నీరందించలేదన్నారు. అసెంబ్లీలో కేటీఆర్ సిరిసిల్ల నేతన్నల సమస్యపై ఎందుకు మాట్లాడలేదన్నారు. కృష్ణ నది నీటిని ధారాదత్తం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీ పనులను విస్మరించి జిల్లాకు సాగునీరు అందకుండా చేశారన్నారు. ఎమ్మెల్యేగా కేటీఆర్ ప్రజా సమస్యలు పరిష్కారానికి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు స్వ రూప, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, రాములు, ఎల్లప్ప, చందన, అమర్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సింగారంలో ప్రత్యేక అభివృద్ధి పథకం కింద మంజూరైన రూ.9.54 కోట్లు, ఉపాధి పథకం ద్వారా మంజూరైన రూ.2కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి గడ్డం మధుకర్(ఛోటు) ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఇందిరమ్మకాలనీ మాజీ వార్డుమెంబర్లు దూస మహేందర్, సామల సరస్వతి సత్యనారాయణ, కారంపూరి కమల, పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, అధ్యక్షురాలు హారిక రెడ్డి, ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ముస్తాబాద్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పులిచేరుకుంట మైసమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉత్సవాల్లో భాగంగా శనివారం పోచమ్మ బోనాలు, ఆదివారం మైసమ్మ బోనాలు నిర్వహిస్తామని కమిటీ బాధ్యులు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తాళ్ల రాజు, గజ్జెల రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ముస్తాబాద్: కేంద్ర ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. మండలంలోని ఆవునూర్, గూడెంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధులు రూ.24 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఉపాధిహామీ, పంచాయతీ నిధులతో నేడు గ్రామాలు అభివృద్ధి పనులతో ముందున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, ఎంపీటీసీ సొల్ల లలిత, క్రాంతికుమార్, శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెస్‌ను రద్దుచేసి ఎన్‌పీడీసీఎల్‌లో కలపాలి



మహేందర్‌రెడ్డికి వివరిస్తున్న దేవయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల సెస్ సంస్థలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నందున వెంటనే సెస్‌ను రద్దుచేసి ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్‌లో కలపాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ద్యావ దేవయ్య డిమాండ్ చేశారు. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల కోసం వచ్చిన కేకే మహేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సెస్‌లో రూ.94,88,71,851 కోట్ల నష్టంతో ఉందని కమీషనర్ సెక్రెటరీ తన నివేదికలో పొందుపర్చినట్లు తెలిపారు. వెంటనే సెస్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు బండారి బాల్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి: మండలంలోని తడగొండ, స్తంభంపల్లి, గుండన్నపల్లి, బూర్గుపల్లి, కోరెం గ్రామాల్లోని సీసీరోడ్ల నిర్మాణాలు, పలు అభివృద్ధి పనులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



బోరుబావికి భూమిపూజ చేస్తున్న నాయకులు

చందుర్తి : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ భవనం జెడ్పీనిధులు రూ.లక్ష 50వేలతో బోరుబావికి శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పిట్టల బాబు, దూది శ్రీనివాస్‌రెడ్డి, దారం హన్మంతురెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు 50 మంది పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్న గ్రామ కార్యదర్శిపై, అక్రమవెంచర్‌పై చర్యలు తీసుకోవాలని కొలనూర్ గ్రామస్తులు ఎంపీడీవోకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో అక్రమ వెంచర్ గురించి జనవరి 21న అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఎంపీవో విచారణ చేపట్టి ప్లాట్లు కొనవద్దని, నిర్మాణాలు చేపట్టవద్దని బోర్డులు ఏర్పాటు చేయాలని కార్యదర్శికి ఆదేశాలు జారీచేశారన్నారు. సదరు కార్యదర్శి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సహకరిస్తూ ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయడం లేదన్నారు. గ్రామ కార్యదర్శిని మరో గ్రామానికి మార్చాలని కోరుతూ వీరవేని తిరుపతియాదవ్, తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, వెంకటేశం, అంజయ్య, ఎల్లయ్య, తిరుపతి తదితరులు కోరుతూ వినతిపత్రం అందజేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: మెగా డీఎస్సీ ప్రకటించినందుకు హర్షం వ్యక్తంచేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, నిరుద్యోగ యువతీ, యువకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ నియామకాలతో నిరుద్యోగుల ఉద్యోగ కలలు నెరవేరనున్నాయని హర్షం వ్యక్తంచేశారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు హమీద్, పట్టణశాఖ అధ్యక్షుడు రాజుగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగి స్వామి, మైనా ర్టీసెల్ జిల్లా కార్యదర్శి తాజొద్దీన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రమ, నాయకులు భాస్కర్, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

ముస్తాబాద్: తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో అరవై రోజులపాటు మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు టీడీఎఫ్ జాతీయ అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈనెల 10లోగా 18 నుంచి 40 ఏళ్లలోపు మహిళలు ఆధార్ కార్డు జిరాక్స్‌తో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఐకేపీ సీసీ రాజ్యలక్ష్మి, శ్రీ వేంకటేశ్వర ఫౌండేషన్‌కు దరఖాస్తులను అందించాలన్నారు. మండలకేంద్రంలోని పోలీస్ పటేల్ మట్ట రామలింగారెడ్డి నివాసంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9959340498 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

గంభీరావుపేట: మండలంలోని మల్లుపల్లికి చెందిన మరాఠి రవికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. రవికుమార్ గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో ప్రభుత్వాన్ని హేళన చేసే విధంగా పోస్టులు చేశాడని అదే గ్రామానికి చెందిన మరాఠి భూదయ్య ఇటీవల జిల్లాకేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. కాగా ఎంపీడీవో రాజేందర్ గ్రామంలో విచారణ చేపట్టారు. అధికారి వెళ్లిన తర్వాత రవికుమార్ తనను, తన కుటుంబ సభ్యులను అసభ్యపదజాలంతో దూషించాడని, చంపుతామని బెదిరించాడని భూదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన వెంగళలక్ష్మీ (65) శుక్రవారం మృతిచెందింది. మృతురాలికి ఎవరూ లేకపోవడంతో దహన సంస్కారాల కోసం చందాలు పోగు చేస్తున్నట్లు తెలుసుకొని ఎస్సై సుధాకర్ వెంటనే స్పందించారు. వెంటనే అక్కడికి చేరుకొని దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్‌ను గ్రామస్తులు, తదితరులు అభినందించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేటలో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుక, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు హమీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రాంచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని గోపాల్‌రావుపల్లె గ్రామ యాదవ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుక్కల అంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షుడిగా కొండవేని శ్రీనివాస్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర గ్రామ శివారులోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన మోతే దేవదాసు, అతని కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు.

నియామకం

సిరిసిల్లటౌన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీసెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా మేకల కమలాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సీసెల్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతం చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. తన నియామకం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం, కటుకం మృత్యుంజయం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఆవునూర్‌కు చెందిన గుండవేని దేవరాజు నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ ముదిరాజ్ ఉద్యోగులు, వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రుద్రంగి: వరిలో కాండం తొలిచేపురుగు, అగ్గితెగులు సోకకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. శుక్రవారం మానాల రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. యాసంగి నువ్వుపంటలో తీసుకోవాలిన్సన యాజమాన్య పద్ధతులు, రసం పీల్చేపురుగు, ఆకు ముడత నివారణ చర్యలపై రైతులకు వివరించారు. ఏఈవో విజయ్, పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు అఖిల, సుష్మ, ప్రియాంక, అమూల్య, రైతులు, లచ్చన్న, గంగా ధర్, రమేశ్, శంకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా అభిషేక్



కోనరావుపేట: మండలంలోని ధర్మారం గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా అన్నబోయిన అభిషేక్ ఎన్నికయ్యారు. శుక్రవారం సమావేశమైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పడిగె అజయ్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రం సతీశ్, కార్యదర్శిగా శ్రీరాముల పర్శరాములు, కోశాధికారిగా పిట్టల ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా మల్లెవేని విజయ్, రామిడి సంజీవ్, తుమ్మల శ్రీనివాస్, పిట్టల వెంకటేశ్ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సామాజిక కార్యకర్త కొండ ఆంజనేయులుగౌడ్ శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మురళిధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల ఫొటోలతో విద్యార్థుల హైరానా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పరీక్షాకేంద్రాలకు సమయానికి చేరుకోవాలనే ఆతృతతో ఇంటర్ విద్యార్థులు ద్విచక్రవాహనాలపై వెళ్తుండగా పోలీసులు ఫొటోలు తీయడంపై విద్యార్థులు హైరానా పడుతున్నారు. శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు మండల కేంద్రంలో మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ ముందు నిల్చొని సిబ్బంది ఫొటోలు తీయడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల (పరీక్షల కేంద్రం) మధ్య పోలీస్‌స్టేషన్ ఉండటంతో ఫొటోలు తీయడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీసు ఉన్నతా ధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో పోచమ్మ ఆలయానికి శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామంలో శిథిలమైన ఆలయ స్థానంలో నూతన ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామంలోని భావణరుషి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం కోసం రూ. 25,016 విరాళంగా అందజేశారు. గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న బాల్‌రెడ్డి

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు మంద బాల్‌రెడ్డి ముందుకొచ్చినట్లు హెచ్‌ఎం రవీందర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృష్ట్యా సాయంత్రం అల్పాహారం మంద బాల్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పుట్టిన రోజు వేడుకలను పాఠశాలలో నిర్వహించే ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా:
✆ 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899